క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సమావేశాన్ని జయప్రదం చేయండి

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం గురువారం స్థానిక పవిత్ర కల్యాణ మండపంలో జరగనుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సీఎస్‌పురం(పామూరు): కనిగిరిలోని పవిత్ర ఫంక్షన్ హాలులో గురువారం ఉదయం 10.30 గంటలకు జరగనున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులుయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్యలు కోరారు. ఈసందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ నియోజకవర్గస్థాయి సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులు, పార్టీ అన్ని విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పిసిపల్లి: కనిగిరిలో జరగనున్న పార్టీ నియోజకవర్గ సమావేశానికి భారీగా తరలిరావాలని మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీ కాంతం ఓకేరెడ్డి, జయరాంరెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి కోరారు. మండలంలో నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

క్రీడాకారునికి ప్రోత్సాహక బహుమతి



విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి

టంగుటూరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని తేళ్ల రిషిత ప్రియ విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ అండర్ - 14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిందని పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలు రమాదేవి తెలిపారు. విద్యార్థిని రిషితప్రియకు జమ్ములపాలెం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బెజవాడ శ్రీనివాసరావు ప్రోత్సాహక బహుమతి రూ. 5 వేలను ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి చేతుల మీదగా అందించారు. పీడీ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హలో మాల.. చలో గుంటూరు కరపత్రాల ఆవిష్కరణ

టంగుటూరు: గుంటూరులో ఈ నెల 15న జరిగే మహాగర్జనను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని నాయుడుపాలెంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాగర్జన కరపత్రాలు ఆవిష్కరించారు. బై బీమ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కందిపాటి కృష్ణ, దినేష్, వెంకటరావు, దోనెప్పూడి సిద్దయ్య, బత్తుల సుమంత్, నాగేంద్ర, సుజిత, బాలకోటయ్య, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో నీరు నిల్వ ఉంచరాదు

కొండపి: పొగాకు పంట పొలాల్లో నిల్వ ఉంచరాదని వేలం వేలం నిర్వహణాధికారి సునీల్ కుమార్ అన్నారు. బోర్డు పరిధిలోని బోడవరం, వెన్నూరు, చిన్నవెంకన్నపాలెం గ్రామాల్లోని పొగాకు పంట పొలాలను బుధవారం పరిశీలించారు. అధిక వర్షపాత సమయంలో పొగాకు పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మురికి నీరు బయటకు పోయే సౌకర్యాలు కల్పించాలని, శిలీంద్రాలు సోకిన పొలాలకు బ్లైట్ టాక్స్ లేదా అమిస్టార్ లేదా క్యాబ్రియోటాప్తో పిచికారీ చేయాలన్నారు. వడలిపోయిన, వేరు తెగులు ఆశించిన పంట పొలాల్లో కాపర్ ఆక్సీ క్లోరైడ్ బ్లైటాక్స్ రెండు గ్రాములు పిచికారీ చేయాలని చేయాలని సూచించారు. పొగాకు బోర్డు, ఫీల్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

టంగుటూరు: టంగుటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు 1, ఆయాలు- 21 ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ మల్లీశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త టంగుటూరు బీసీ కాలనీ, జనరల్, అంగన్‌వాడీ ఆయాలు టంగుటూరు, వెంకటాయపాలెం(బీసీ-డీ), ఆలకూరపాడు-3,(జనరల్), టంగుటూరు 7వ వార్డు(జనరల్), మర్లపాడు - 1(జనరల్), కారుమంచి - 5(ఎస్టీ), సూరారెడ్డిపాలెం- 1(జనరల్), కాకుటూరివారిపాలెం(జనరల్), టంగుటూరు, ముత్తరాజుపాలెం(జనరల్), టంగుటూరు అంబేడ్కర్ నగర్(ఎస్సీ), తూర్పునాయుడుపాలెం - 3(ఎస్సీ), ఆలకూరపాడు- 5(ఎస్సీ), టంగుటూరు హరిజనవాడ - 4(ఎస్సీ), సింగరాయకొండ మండలంలో చెల్లెమ్మగారిపాలెం(బీసీ-ఏ), పాత సింగరాయకొండ -1(బీసీ-డీ), పాత సింగరాయకొండ -2(ఎస్సీ), ఊళ్లపాలెం -1(జనరల్), కలికివాయి -1(జనరల్) ఊళ్లపాలెం-2(జనరల్), జరుగుమల్లి మండలంలో వావిలేటిపాడు(ఎస్సీ), వర్ధినేనిపాలెం, జనరల్, నర్సింగోలు -2(ఎస్సీ)లకు కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు టంగుటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.



సింగరాయకొండ పంచాయతీలోని హనుమాన్‌నగర్‌లో మూతపడిన వాటర్‌ప్లాంట్



ఎంపీడీఓ కార్యాలయంలో మూతపడ్డ వాటర్‌ప్లాంట్



మూతపడిన సోమరాజుపల్లి పంచాయతీ టీపీనగర్ వాటర్‌ప్లాంట్

మంచినీరివ్వండి మహాప్రభో..!

- మూతపడిన వాటర్‌ప్లాంట్లు
- తాగునీటికి తీవ్ర ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

సింగరాయకొండ:

పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని పలు ప్రాంతాల్లోని వాటర్ ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. అవి మూలనపడి నెలలు గడుస్తున్నా అధికారులు వాటి వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఎవరన్నా అడపాదడపా ఫిర్యాదు చేస్తే చూద్దాంలే అన్న ధోరణిలో ఉన్నారు. దీంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.

మూతపడిన వాటర్‌ప్లాంట్లు..

మండలంలోని సింగరాయకొండ, పాతసింగరాయకొండ, సోమరాజుపల్లి, బింగినపల్లి పంచాయతీలోని 8 వాటర్‌ప్లాంట్లు మూతబడటంతో ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. బింగినపల్లి పంచాయతీలో గత 10 రోజులుగా ప్లాంటు మూతపడగా, మిగిలిన పంచాయతీల్లో ప్లాంట్లు మూతబడి నెలలు గడుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్లాంట్ మూతపడటంతో మండల కాంప్లెక్స్‌లోని ఎంపీడీఓ కార్యాలయం, ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ సబ్ రిజిస్ట్రార్, కనుమళ్ల సొసైటీ, వ్యవసాయశాఖ, విద్యాశాఖ, ఆర్‌బీకే, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యాలయానికి ప్రతిరోజు వచ్చే వందల మంది ప్రజలకు తాగునీటి ఇబ్బంది తప్పటం లేదు. ఇటీవల మండల కాంప్లెక్స్‌లో ఉన్న పలు మార్గాలను మూసివేసి ఒకే దారి ఏర్పాటు చేయడంతో ఒక్క వాటర్‌క్యాన్ కోసం అరకిలోమీటరు పోవాల్సి వస్తుందని కార్యాలయాల సిబ్బంది ఆరోపిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాటర్‌ప్లాంట్ మూతపడటంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు తాగునీరు అందించాలంటే సిబ్బందికి సమస్యగా మారింది. హనుమాన్‌నగర్‌లో ప్లాంట్ మూతబడి నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవటంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అలాగే సోమరాజుపల్లి పంచాయతీ టీపీనగర్ వాసులు కూడా ప్లాంట్ మూతబడటంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని కిలోమీటరు దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.



పాతసింగరాయకొండలో వాటర్‌ప్లాంట్ మూతపడటంతో బిందెలతో నీరు మోసుకుంటున్న మహిళ

పట్టించుకునే నాథుడులేడు..

గ్రామాల్లో వాటర్‌ప్లాంటు మరమ్మతులకు గురై మూతబడితే ఒక్క అధికారి కూడా పట్టించుకున్న నాథుడు లేడని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో తాగునీటి పంపిణీ వ్యవస్థను పర్యవేక్షించే గ్రామీణ నీటిసరఫరా శాఖ అధికారులేమో వాటర్‌ప్లాంట్ పర్యవేక్షణ గ్రామ పంచాయతీలకు అప్పగించామని, మాకు బాధ్యత లేదని చెబుతున్నారని, అయితే ప్లాంట్ రిపేరు చేయాలంటే ఆశాఖ అధికారులే అయిన ఖర్చును నమోదు చేయాలని అటువంటప్పుడు వారికి ఎందుకు బాధ్యత లేకుండా ఉంటుందని గ్రామ పంచాయతీ వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూతపడ్డ వాటర్‌ప్లాంట్‌లు పనిచేసేలా చర్యలు తీసుకుని తాగునీటి ఇబ్బందిని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో మూతపడ్డ వాటర్ ప్లాంటు

కిలోమీటర్ వెళ్లాల్సి వస్తోంది..

పాతసింగరాయకొండలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సుమారు కిలోమీటరు దూరంలోని ప్లాంట్‌కు వెళ్లి మంచినీరు తెచ్చుకోవాల్సి వస్తుందని, ఒక్కోసారి బోరు వాటరే తాగుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీకాలనీలో వాటర్‌ప్లాంట్ మరమ్మతులకు గురైతే అధికార పార్టీ నాయకులు ప్లాంట్‌కు రంగు మార్చడంలో ఉన్న శ్రద్ధ తాగునీరు అందించటంలో చూపటం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.. కాలనీకి వాటర్ సరఫరా చేసే ఆటోలు వస్తే తప్ప మాకు తాగునీరు అవకాశం లేదని నీరు తెచ్చుకోవాలంటే సుమారు రెండు కిలోమీటర్ దూరం పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ



చల్లగిరిగల్లో పొలం పిలుస్తోందిలో పాల్గొన్న అధికారులు



పెదరాజుపాలెంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్



మల్లవరప్పాడులో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ వైద్యులు ధనలక్ష్మి

సీఎస్‌పురం(పామూరు): పప్పు శనగ పంటను ఆశించే శనగ పచ్చపురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని కంభంపాడు, పెదరాజుపాలెం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా కంభంపాడులోని శనగ పంటను పరిశీలించిన ఏఓ సంపత్‌కుమార్ శనగపచ్చ పురుగును గుర్తించారు. ఆకుమాడు తెగులును గుర్తించి నివారణ సూచించారు. వరిలో అగ్గి తెగులు గుర్తించి నివారణ చర్యలు సూచించారు.

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): రబీ సీజనల్‌లో సాగు చేసుకున్న పంటలకు ఈ క్రాప్ తప్పని సరిగా చేయించుకోవాలని, ఈ నెల 15 లోగా పంటల బీమా చెల్లించాలని వ్యవసాయాధికారి జ్యోత్స్న రైతులకు సూచించారు. మండలంలోని చల్లగిరిగల, తుమ్మకుంట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా సాగు చేసిన కంది, మినుము, మొక్కజొన్న, పప్పుశనగ, జొన్న, ఎండుమిర్చి పంటలకు బీమా చేసుకోవాలని సూచించారు. కందికి మారుకా మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉందని, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్ఓ ఎం అంజలీబాయి, వీఏఏలు షేక్ నజ్మా, షేక్ మహబూబ్, వెటర్నరీ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

టంగుటూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గడ్డి పెంచుకునే రైతులకు మూడేళ్లపాటు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని పశుసంవర్ధక శాఖ వైద్యులు ధనలక్ష్మి అన్నారు. మండలంలోని వాసేపల్లిపాడు, మల్లవరప్పాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మొదటి సంవత్సరం రూ.32 వేలు, రెండో ఏడాది రూ.25 వేలు అందిస్తుందని, నీటి వసతి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీఏఏ సౌమ్య, విస్తరణ అధికారి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తాటాకులపాలెంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

కొండపి: మిరపలో ఫిజేరియం ఎండు తెగులు నివారణకు బ్లైటాక్స్ మందును పిచికారీ చేసుకోవాలని ఏఓ విజయకుమార్ తెలిపారు. మండలంలోని చినకండగుంట, తాటాకులపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భముగా వరి, మిరప పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. విస్తరణ అధికారి తేజస్వి, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

సీఎస్‌పురం(పామూరు): రెవెన్యూ సదస్సులో తగిత ఆధారాలు అందజేసి భూ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి అన్నారు. మండలంలోని కంభంపాడు, డీటీపల్లె గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్, సరిహద్దుల కోసం కంభంపాడులో 5 అర్జీలు, డీటీపల్లెలో 7 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ పి.వెంకటేశ్వర్లు, వీఆర్ఓలు బి.మాల్యాద్రి, షేక్.ఖాజరఫి, దేవాదాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): మండలంలోని దిరిశమంచ గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 9 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఓఆర్‌కు 7, భూమి సర్వే చేయాలని 1, అసైన్డ్ భూమి కావాలని ఒక అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చిన అర్జీలు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఐపీ పురుషోతంరెడ్డి, డీటీ రవిశంకర్‌రెడ్డి, ఆర్ఐ లావణ్య, వీఆర్ఓలు పాల్గొన్నారు.



యడవల్లిలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి

హనుమంతునిపాడు: మండలంలోని కూటాగుండ్లలో జరిగిన రెవెన్యూ సదస్సులో మొత్తం 20 అర్జీలు వివిధ సమస్యలపై వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో భూమి ఆన్‌లైన్ చేసి పట్టాదార పాస్‌పుస్తకాల ఇవ్వాలని 10 అర్జీలు, ఆన్‌లైన్ చేయాలని 8, ఇతర అర్జీలు 2 వచ్చినట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చిన అర్జీలు పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. డీటీ కె.కిషోర్‌రెడ్డి, మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతరెడ్డి, దేవదాయ శాఖ అధికారి శివశంఖర్, వీఆర్వో పరుశురామ్, సిబ్బంది పాల్గొన్నారు.



కూటాగుండ్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు అందచేస్తున్న రైతులు



డీటీపల్లెలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

- టీడీపీ నేతల దుశ్చర్య

దర్జాగా పట్టా భూమి కబ్జా

టంగుటూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ నేతల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇసుక, గ్రావెల్ మాఫియా గ్రామాల్లో సాగిస్తున్న అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు ఏకంగా పట్టా భూమిని కబ్జా చేసి అందులోని మట్టిని జేసీబీ, లారీల సాయంతో పక్క గ్రామాలకు తరలించి జేబులు నింపుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని కందులూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం జోన్ 5 ఇన్‌చార్జి బొట్ల రామారావుకు చెందిన పట్టా భూమి సర్వే నంబర్ 385/2 లో 45 సెంట్ల భూమి ఉంది. అయితే గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు దామచర్ల బసవయ్య, గోగినేని శ్రీనివాసులు, మరో ఐదుగురు భూమిని కబ్జా చేశారు. ఆ భూమిలోని మట్టిని తవ్వి ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. దీనిపై బొట్ల రామారావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



పట్టా భూమిలో మట్టి తవ్వకాలు చేస్తున్న టీడీపీ నాయకులు

సంపూర్ణమ్మను పరామర్శించిన మాజీ మంత్రి సురేష్

పొన్నలూరు: మండలంలోని పాతశింగరబొట్లపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి భార్య సంపూర్ణమ్మకు ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. దీంతో వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, చిర్రా ఆదిరెడ్డి పాల్గొన్నారు.



సంపూర్ణమ్మను పరామర్శిస్తున్న మాజీ మంత్రి సురేష్

దశదిన కర్మకు హాజరైన మంత్రి సురేష్

పొన్నలూరు: మండలంలోని చౌటపాలెం గ్రామానికి చెందిన సర్పంచ్ అనుమోలు ప్రసాద్ అమ్మమ్మ ఉన్నం లక్ష్మమ్మ దశదిన కర్మకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు ఆదిమూలపు సురేష్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ కాట్రగడ్డ నరసింగరావు, దావులూరి మాల్యాద్రి, చెన్నారెడ్డి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సురేష్

సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మురళి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న తహశీల్దార్ రవి

సింగరాయకొండ: మండలంలో ఈ నెల 14వ తేదీ జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరిగేలా ఎన్నికల అధికారులు కృషి చేయాలని, ఎటువంటి ఒత్తిళ్లకు లొంగద్దని తహసీల్దార్ టి.రవి ఎన్నికల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పీఓ, ఏపీఓలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఈ సమయంలో ఎన్నికలు నామినేషన్ల ప్రక్రియతో ప్రారంభమై అభ్యర్థి ఎంపికతో ముగుస్తుందన్నారు. మండలంలో సోమరాజుపల్లి-1,2,పాకల-1,2, కలికవాయ, కనుమళ్ల, బింగినపల్లి గ్రామాల సాగునీటి సంఘాలకు జరుగుతాయన్నారు. సోమరాజుపల్లి సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రభుత్వ జూనియర్ కాలేజి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరగగా, మిగిలిన సంఘాల ఎన్నికలు ఆయా గ్రామాల్లో జరుగుతాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది ఏవిధంగా నడుచుకోవాలో వివరించారు. ఎన్నికల్లో పక్షపాత ధోరణి అవలంబించకుండా సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఇరిగేషన్ శాఖ ఏఈ రవికుమార్, ఏఓ సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీహరి, డీటీ ముస్తాక్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఎన్నికల అధికారి పి.మురళి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆరు సాగునీటి చెరువులకు ఆరుగురు ఎన్నికల అధికారులను నియమించినట్లు తెలిపారు. కొండపి చెరువుకు ఎంఈఓ-2 రామారావును, చిన్న కండ్లకుంట పంచాయతీలోని తాటాకులపాలెం చెరువుకు తహశీల్దార్ పి.మురళిని, ముప్పవరం చెరువుకు ఒంగోలు ఇరిగేషన్ అధికారి బాపమ్మను, పెట్లూరు-1 చెరువుకు ఎంపీడీఓ రామాంజనేయులు, పెట్లూరు-2 చెరువుకు ఎంఏఓ విజయ్‌కుమార్‌ను, పెట్లూరు- 3 చెరువుకు ఎంఈఓ-1 కె.సురేఖను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


భూ సమస్యలు పరిష్కరించని సదస్సులెందుకు?

సీఎస్‌పురం(పామూరు): భూసమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నా ఒక్క సమస్యకూడా పరిష్కరించలేదని ఇక రెవెన్యూ సదస్సుల నిర్వహించడం అవసరమా అని రైతుసంఘం మండల కార్యదర్శి మారంరెడ్డి రత్నారెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారంవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసైన్‌మెంట్ భూములు మార్చేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని, ప్రస్తుతం మండలంలో అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన సమస్యలే అధికంగా ఉన్నాయని సైట్ ఓపన్‌కాకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయన్నారు. మ్యుటేషన్‌కు సంబంధించిన అర్జీలు ఎక్కువగా ఉన్నాయని ఒక్క మ్యుటేషన్ కూడా అమోదం పొందలేదన్నారు. గత అక్టోబర్ మాసంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారని, నాడు వచ్చిన అర్జీలలో ఒక్క అర్జీకూడా పరిష్కరించలేదన్నారు. ఇటీవల ప్రజాదర్బార్ పేరుతో ఎంపీడీఓ కార్యాలయంవద్ద ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక గ్రామ సభనిర్వహించి అర్జీలు స్వీకరించాలని, నాడు వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం రైతులను మభ్యపెట్టేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసి ప్రజాసమస్యల పరిష్కరంకోసం కృషిచేయాలని ఆయన కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతుసంఘం మండల కార్యదర్శి మారంరెడ్డి రత్నారెడ్డి

ఎన్‌హెచ్‌ఆర్‌సీ నేషనల్ అడిషనల్ కన్వీనర్‌గా శ్రీధర్



కన్వీనర్‌గా శ్రీధర్

కనిగిరిరూరల్: అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నంలోని సెంట్రల్ లైబ్రరీలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫౌండర్, నేషనల్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కనిగిరికి చెందిన సామాజికవేత్త గుత్తి శ్రీధర్‌ను నేషనల్ అడిషనల్ కన్వీనర్‌గా నియమించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ మేరకు బుధవారం కనిగిరిలో పలువురు ప్రముఖులు, నాయకులు, సామాజికవేత్తలు శ్రీధర్‌ను అభినందించారు.

సమ్మెటివ్ ప్రశ్నాపత్రాలను పంపిణీ చేయాలి

సీఎస్‌పురం(పామూరు): సమ్మెటివ్-1 ప్రశ్నాపత్రాలను స్కూల్ కాంప్లెక్స్ నుంచి పంపిణీ చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అరియారం సురేష్, సీఎస్‌పురం మండల అధ్యక్ష, కార్యదర్శులు నారిశెట్టి వెంకటరామయ్య, షేక్.పాదుషా అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజు ప్రధానోపాధ్యాయులు ఉదయం, సాయంత్రం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి ప్రశ్నాపత్రాలను తెచ్చుకోవాలనే ఆదేశాల వల్ల హెచ్ఎంలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉన్న పాఠశాలలు, సింగిల్ స్కూల్ పాఠశాలల హెచ్ఎంలకు ఈ విధానం కష్టతరంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి స్కూల్ కాంప్లెక్స్ పరిధి నుంచి మాత్రమే ప్రశ్నపత్రాలు తీసుకోవాలని సవరణ ఉత్తర్వులు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్ల తొలగింపు



ఊళ్లపాలెం-పాకల రోడ్డులో చిల్లచెట్లను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

సింగరాయకొండ: మండలంలో ఊళ్లపాలెం- పాకల రహదారిలో రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఈనెల 1వ తేదీన 'చిల్లచెట్లను తొలగించండి' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ సర్పంచ్ పాకనాటి అనసూయమ్మ, కార్యదర్శి షేక్ సైదులు చిల్లచెట్లను తొలగించారు.

ఎస్సీ వర్గీకరణలో సామాజిక న్యాయం లేదు

హనుమంతునిపాడు: ఎస్సీ వర్గీకరణలో సామాజిక న్యాయం లేదని అఖిల భారత మాలలు జేఏసీ కన్వీనర్, మాల సంఘాల జేఏసీ కన్వీనర్ యరజాల బాలనారాయణ ఐక్యవేదిక నియోజకవర్గ కార్యదర్శి కల్వకూరి శాంతరాజు లన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నెల 15న గుంటూరులో జరగనున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కరపత్రాన్ని ఆవిష్కరించారు. నాయకులు బాలబాదుర్ల, కొటపాటి రమణ, పందిటి మోహన్, యానాది, పి.చిన్న కొండయ్య, దమ్ము శ్రీను, మురహరి శ్రీను, యల్నాటి కోటయ్య, దరశరథ, దమ్ము బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.